
సాక్షి అనంతపురం

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.18 వేలు పలికాయి.



19న ఐఏబీ సమావేశం

సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈ నెల 19న నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నిర్ణయించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం 35.3°/24.5°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన జగదీష్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. కుందుర్పి మండలం తూమకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త జగదీష్, ఆయన భార్య రోజా, వారి బంధువులపై శుక్రవారం రాత్రి టీడీపీ మూకలు దాడులకు పాల్పడ్డాయి. తీవ్రగాయాలైన బాధితులను స్థానికులు అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శనివారం బాధితులను పరామర్శించారు. వారి పరిస్థితిని వైద్యులతో ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆర్‌ఎంఓ పద్మజకు సూచించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడుతూ.. భయపడాల్సిన పనిలేదన్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కుందుర్పి ఎంపీపీ కమల నాగరాజు, మార్కెట్ డైరెక్టర్ జీ లింగప్ప, ఎనమలదొడ్డి సర్పంచ్ విజయ్, తెనగల్లు సర్పంచ్ వరలక్ష్మి వెంకటేశులు, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి తదితరులున్నారు.

'ఈ-క్రాప్'కు నేటితో ముగింపు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈ-క్రాప్ ప్రక్రియ నమోదు గడువు ఆదివారంతో ముగియనుందని వ్యవసాయశాఖ జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లోకి ఎక్కించడం 99 శాతం పూర్తయిందన్నారు. రైతుల వివరాలకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ 41 శాతం పూర్తయినట్లు తెలిపారు. ఈ-కేవైసీ గడువు మరో మూడు, నాలుగు రోజులు పొడిగించవచ్చన్నారు. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 10,66,675 ఎకరాలు కాగా.. 8,30,070 ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 8.20 లక్షల ఎకరాలు ఈ-క్రాప్ పూర్తయిందన్నారు. ఈ-కేవైసీ మాత్రం 3 లక్షల ఎకరాలు పూర్తయినట్లు తెలిపారు. ప్రక్రియకు తుది గడువు ఆదివారం అయినా, ఈ-కేవైసీ ఇంకా చేయాల్సి ఉన్నందున గడువు మరికొన్ని రోజులు పొడిగించవచ్చని తెలిపారు.

ఈ-కేవైసీ చేయించండి

గుమ్మఘట్ట/బొమ్మనహాళ్: పంటల నమోదులో నిర్లక్ష్యం చేయకుండా ఈ కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గుమ్మఘట్ట మండలంలోని 75వీరాపురం గ్రామ సమీపంలో సాగు చేసిన పంటలను, బొమ్మనహాళ్ మండలం నేమకల్లు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేవైసీ చేయించుకుంటేనే రాయితీలు, నష్ట పరిహారాలు అందుతాయన్నారు. వేరుశనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓలు నిర్మల్ కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



బాలుడు నందకిశోర్‌తో వైద్యులు

పామిడి: పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యులు ఓ బాలుడికి అరుదైన శస్త్రచికిత్స చేశారు. బాధ నుంచి శాశ్వత విముక్తి కలిగించారు. వివరాలు.. పామిడికి చెందిన పదేళ్ల బాలుడు నందకిశోర్‌కు ఐదేళ్ల క్రితం నడుము వద్ద గడ్డ లేచింది. ఇటీవల పెద్దదైపోయింది. నొప్పి పుడుతుండడంతో కుటుంబీకులు స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. దీంతో శనివారం ఆసుపత్రి వైద్యాధికారి జీ. శివకార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిపుణులు కమలాకర్, హెడ్‌నర్సు శివకుమారి, థియేటర్ అసిస్టెంట్ అంజినప్ప బృందం ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యుడు శివకార్తీక్ రెడ్డి మాట్లాడుతూ బాలుడి సమస్యను వైద్య పరిభాషలో ఫారిన్ బాడీ అంటారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సీఆర్‌ఎం ఎక్స్‌రే మిషన్ సహాయంతో ఆపరేషన్ చేస్తారన్నారు. ఇందుకు దాదాపు రూ. లక్ష వరకూ ఖర్చవుతుందన్నారు. తమ ఆస్పత్రిలో అన్ని వసతులూ అందుబాటులో ఉండడంతో ఉచితంగా చేశామన్నారు.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



రాష్ట్రంలో వైద్య అవసరాలు దృష్టిలో ఉంచుకుని నూతన కళాశాలలు అవసరం. ఇలాంటి సందర్భంలో 5 కళాశాలల్లో 700 సీట్లు రద్దు చేయడం, మరో ఏడు కళాశాలల నిర్మాణం నిలిపివేయడం సరికాదు. ఏటా దేశ వ్యాప్తంగా 26 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారు. ఎంబీబీఎస్ సీట్లు 1,20,000 మాత్రమే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నూతన కళాశాలల ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– కస్య స్మృతి, ఎంబీబీఎస్ రెండో సంవత్సరం, అనంతపురం



ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు



నా కుమారుడు రాహుల్ సాయి ఇటీవలే నీట్ రాశాడు. మంచి మార్కులు వచ్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో సీట్లు పెరుగుతాయని ఎంతో సంతోషపడ్డా. తప్పకుండా ఈ సారి సీటు వస్తుందనే నమ్మకం ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను నిర్వహించలేమని, ప్రైవేట్ పరం చేస్తున్నట్లు ప్రకటించడంతో రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

– సోమనాథ్ రెడ్డి, శెట్టూరు

ఈనెల 10న..

- అనంతపురం నగర పరిధిలోని ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డులో ఉన్న ఓ షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యంతో పాటు ప్లాస్టిక్ సంచులు కుట్టే మిషన్, ఒక ఎండీయూ వాహనం, ఒక ఆటో సీజ్ చేశారు. ముగ్గురు వ్యక్తులపై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

ఈనెల 11న

- పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో టాటా ఎస్ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి అందులోని రెండు టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

గత నెల 13న

- అనంతపురంలోని రాణినగర్‌లో ఒక ఇంట్లో అక్రమంగా పెద్ద ఎత్తున నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తులపై కేసు నమోదు చేశారు.



అనంతపురంలో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

నల్ల బజారుకు పేదల బియ్యం

జిల్లాలో కేసులు ఇలా...

జనవరి నుంచి ఇప్పటి వరకు కేసులు	92
స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం	158.166 టన్నులు
సీజ్ చేసిన బియ్యం విలువ	రూ.70,38,387

- జిల్లాలో జోరుగా దందా
- టీడీపీ నేతల ఆధ్వర్యంలో అక్రమ వ్యాపారం
- భారీ ఎత్తున రేషన్ బియ్యం సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయాలు
- యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్న వైనం

అనంతపురం అర్బన్: రేషన్ బియ్యం దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వారి నుంచి బియ్యం సేకరించి అక్రమంగా నల్లబజారుకు తరలిస్తున్నారు. కొందరు ఇదే వృత్తిగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా తగ్గేదే లే అంటూ యథేచ్ఛగా దందా చేస్తున్నారు.

రూ.10కి కొని.. రూ.50కి అమ్ముతూ

అక్రమార్కులు కిలో బియ్యం రూ.10 నుంచి రూ.12తో కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలు, జిల్లాలో సరిహద్దు గ్రామాల్లో దందా సాగిస్తున్నారు. పేదల నుంచి సేకరించిన బియ్యాన్ని 50 కేజీల సంచుల్లో నిల్వ చేసి కర్ణాటక రాష్ట్రం బళ్లారి, బెంగుళూరు, బంగారుపేట, పావగడ, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కిలో రూ.50 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

క్రిమినల్ కేసుల నమోదు



రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా నుంచి రవాణా జరిగే మార్గంలో నిఘా ఉంచాం. విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తూ అక్రమంగా రవాణా అవుతున్న బియ్యం పట్టుకుంటున్నారు. అక్రమార్కులపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

– శోభారాణి, పౌర సరఫరాల అధికారి

కొత్త సంచుల్లో నింపి సోనాగా...

రేషన్ బియ్యాన్ని కొందరు పాలిష్ చేసి కొత్త సంచుల్లో కుట్టి సోనామసూరి పేరుతో విక్రయిస్తున్నారు. ఇంకొందరు నేరుగా కొత్త సంచుల్లో వేసి సీల్ వేసి సోనామసూరి పేరుతో అమ్ముతున్నారు. ఈనెల 11న నగరంలోని ఎన్‌టీఆర్ మార్గ్ సమీపంలో ఇలాంటి ఉదంతమే వెలుగులోకి వచ్చింది. 50 కేజీల చొప్పున కొత్త సంచుల్లో నింపిన రేషన్ బియ్యంతో పాటు సీల్ చేసేందుకు ఉపయోగించిన మిషన్ స్వాధీనం చేసుకున్నారు.

కఠిన శిక్షలు లేకనే...

కఠిన శిక్షలు లేకపోవడంతోనే అక్రమార్కులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు. ఈ కేసులను జాయింట్ కలెక్టర్ విచారణ చేసి జరిమానా విధిస్తారు. అలా కాకుండా కఠిన శిక్షలు అమలు చేస్తే కొంత వరకు కట్టడి చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి

యాడికి మండలంలో విచ్చలవిడిగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాడికి మండలంలో టీడీపీ నేతలు రేషన్ బియ్యం దందాకు తెరలేపారు. 'ప్రభుత్వం మాది. మాకెవరు అడ్డు చెప్పేది' అనే రీతిలో రెచ్చిపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు, రాయలచెరువు గ్రామానికి చెందిన మరో ఇద్దరితో పాటు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలానికి చెందిన మరో వ్యక్తి కలిసి దందాను మూడు లారీలు, 6 ఆటోలు అన్న రీతిలో కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి మండలాలు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్ల ద్వారా యాడికి మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లుతో పాటు రాయలచెరువులోని తమ అడ్డాకు చేర్చుతున్నారు. అక్కడి నుంచి గుట్టుగా రాత్రి సమయాల్లో కర్ణాటక ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు తరలించి సన్న బియ్యంగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా, అధికారులు మాత్రం చూసీచూడనట్లు మిన్నకుండిపోతున్నారు. మామూళ్లు ముట్టజెబుతుండడంతోనే పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.



యాడికిలో నంబర్ లేని ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్న దృశ్యం

లింగ నిర్ధారణకు పాల్పడితే కేసులు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్ కుమార్ హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్ట్) అమలుకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లకు వచ్చే వైద్యులు, అక్కడి సిబ్బందికి చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ నేరం అనే విషయాన్ని ప్రజలకూ తెలియజేసేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ దుర్గేష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫిర్యాదుల స్వీకరణ ఉండదు

అనంతపురం అర్బన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఈనెల 16వ తేదీ (సోమవారం) ప్రభుత్వ సెలవు దినమని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కారణంగా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఫిర్యాదుల స్వీకరణ) ఉండదని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

4,440 కేసులకు పరిష్కారం



జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4,440 కేసులకు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 22 బెంచులు నిర్వహించారు. బాధిత ఫిర్యాదుదారులు రాజీకి సమ్మతించడంతో 3,021 క్రిమినల్ కేసులు, 123 సివిల్ కేసులు, 62 మోటార్ వాహన ప్రమాద భరిత కేసులు, 1,234 ప్రీ లిటిగేషన్ కేసులు (పంచాయతీ ట్యాక్సు, మునిసిపల్ ట్యాక్సు కేసులు, బ్యాంకు రికవరీ కేసులు) పరిష్కారం అయ్యాయి. ప్రమాద భరిత కేసుల్లో కక్షిదారులకు రూ.3,23,35,000 పరిహారం ఇప్పించారు. సివిల్ కేసుల్లో రూ. 20,32,500, ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.2,02,38,962ను కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి. శ్రీనివాస్ , జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివ ప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

- అనంతపురం కోర్టులో లోక్ అదాలత్‌కు విచ్చేసిన కక్షిదారులకు అన్నదానం చేశారు. జిల్లా జడ్జి శ్రీనివాస్‌తో పాటు ఎస్పీ పి. జగదీష్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేసుల రాజీ ప్రాధాన్యత వివరించారు.

'పచ్చ' రౌడీల విధ్వంసం

- వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పొలం కంచె, పైపులు ధ్వంసం
- అడ్డొస్తే అంతు చూస్తామంటూ 20 మందితో హంగామా



జేసీబీతో కంచె, పైప్‌లైన్ పగలగొడుతున్న దృశ్యం

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఎం. రాధిక పొలంలో విధ్వంసం సృష్టించారు. సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజ్‌కుమార్ గ్రామంలో లేని సమయాన దౌర్జన్యం చేశారు. వివరాలు.. దేవగిరి సమీపంలో బండూరు వద్ద సర్వే నంబర్ 128లో సర్పంచ్ రాధికకు 9.60 ఎకరాల పొలం ఉంది. దానిమ్మ చెట్లు సాగు చేస్తున్నారు. పొలం చుట్టూ కంచె నిర్మించుకున్నారు. వీరి పొలం అవతల కొండ ఉంటుంది. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు కొండలో మట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ ఆ కొండపై కన్నేశారు. కొండ దగ్గరికి వెళ్లాలనే ఉద్దేశంతో శనివారం వైఎస్సార్ సీపీ సర్పంచ్ పొలంలోకి అక్రమంగా చొరబడ్డారు. జేసీబీతో పొలం కంచె ధ్వంసం చేశారు. చెట్లకు నీటి సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన పైపులు పగులగొట్టారు. ఎవరైనా అడ్డొస్తే అంతు చూస్తామంటూ 20 మంది నానా హంగామా చేశారు. పచ్చమూకలకు భయపడ్డ సర్పంచ్ రాధిక ఇంట్లోనే ఉండిపోయారు.

ఎన్నికల్లో గెలిచామనే అక్కసు..

దీనిపై సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాను గ్రామంలో లేనప్పుడు పొలంలోకి చొరబడడం అన్యాయమన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య గెలిచినప్పటి నుంచి కక్ష పెంచుకున్నారన్నారు. కొండ నుంచి మట్టి కొల్లగొట్టాలనే ఉద్దేశంతో తన పొలంలో బీభత్సం సృష్టించారన్నారు. పైపులు, కంచె ధ్వంసంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. చెట్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. పోలీసులు, అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఉపేక్షించేది లేదు..

తమ పార్టీ సానుభూతిపరులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హెచ్చరించారు. రాజ్‌కుమార్ పొలంలో పచ్చ మూకలు చొరబడి హంగామా చేయడం హేయమన్నారు. ఈ విషయాన్ని ఎస్పీ, డీఎస్పీ, సీఐల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. న్యాయం చేయకుంటే బొమ్మనహాళ్ పోలీసుస్టేషన్ వద్ద పార్టీ శ్రేణులతో కలసి ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

పాసులున్నా నిరాశే..



పాసులున్న వారిని గేటు వద్దే అడ్డుకుంటున్న పోలీసులు

- ఇష్టారాజ్యంగా పోలీసుల బంధువులు, ఆర్డీటీ సిబ్బందికి అనుమతి
- పాసులున్న వారికి మాత్రం నిరాకరణ
- క్రికెట్ ప్రేమికులకు తీరని వేదన

అనంతపురం: దులీప్ ట్రోఫీ నిర్వాహకుల తీరు మారడం లేదు. ఫలితంగా క్రికెట్ ప్రేమికులకు నిరాశ తప్పడం లేదు. దులీప్ ట్రోఫీలో భాగంగా ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న మ్యాచులు చూసేందుకు శనివారం క్రికెట్ ప్రేమికులు పోటెత్తారు. అభిమాన క్రికెటర్లను చూడాలనే ఆశతో ఆర్డీటీ స్టేడియం వద్దకు వచ్చారు. అయితే, చేతిలో పాస్ ఉన్నా పోలీసులు చాలామందిని స్టేడియంలోకి అనుమతించలేదు. దాదాపు వెయ్యి మందిని అడ్డుకున్నారు. వీఐపీ పాసులు ఉన్న వారిని సైతం అనుమతించలేదు. స్టేడియం నిండిపోయిందని, వెళ్లడం కుదరదంటూ తేల్చిచెప్పారు. దీంతో అంతా నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. సెలవు రోజు క్రికెట్‌ను ఆస్వాదిద్దామని వస్తే ఆశలు ఆవిరి చేశారంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత మాత్రానికి పాసుల విధానం ఎందుకు పెట్టారంటూ పలువురు ప్రశ్నించారు.

ఇష్టారాజ్యంగా అనుమతి..

ఆర్డీటీ ఏ- మైదానంలో 4,200 మంది ప్రేక్షకులు మ్యాచ్ వీక్షించే సామర్థ్యం ఉంది. దీనికి తోడు వీఐపీలు 150 మంది రావచ్చు. మీడియా ప్రతినిధులు 60 మంది దాకా కూర్చునే సదుపాయం ఉంది. 4,410 మందికి మించి పాసులు ఇవ్వడానికి వీలులేదు. ఆ మేరకే పాసులు కూడా పంచారు. అయితే, పాసులు పొందకున్నా పోలీసుల కుటుంబ సభ్యులు, బంధువులు, ఆర్డీటీ సిబ్బంది, వారి బంధువులను ఇష్టారాజ్యంగా అనుమతించడంతో స్టేడియం నిండి తోంది. దీంతో పాసులు పొందిన వారిని అడ్డుకుంటుండడం గమనార్హం.

నేడు మరింత మందికి భంగపాటేనా..?

సెలవు దినం కావడంతో ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో పాసులు పొందిన అందరినీ స్టేడియంలోకి అనుమతిస్తారా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. ఏది ఏమైనా, దులీప్ ట్రోఫీ నిర్వహణలో నిర్వాహకుల వైఫల్యం కారణంగా క్రికెట్ ప్రేమికులకు నిరాశ తప్పడం లేదు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని పాసులు పొందిన అందరికీ మ్యాచ్ వీక్షించే అవకాశం కల్పించాలని క్రికెట్ ప్రేమికులు కోరుతున్నారు.

దుర్గంలో దాహం కేకలు

- రోడ్డెక్కి మహిళల నిరసన
- విజయవాడలో వరదలు వస్తే విరాళాలు సేకరించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు
- ముందు తన నియోజకవర్గంలో సమస్యలు తీర్చాలంటున్న పట్టణవాసులు



తాగునీటి సమస్య తీర్చాలంటూ కళ్యాణదుర్గంలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: 'దాహం తీర్చండి మహాప్రభో' అంటూ శనివారం కళ్యాణదుర్గం పట్టణంలోని కొల్లాపురమ్మ గుడి వద్ద ప్రధాన రహదారిపై మహిళలు బైఠాయించారు. ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులుగా కళ్యాణదుర్గం పట్టణంలో శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి సరఫరా లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ట్యాంకర్లు తెప్పించుకుని వినియోగించుకుంటున్నామని వాపోయారు. నీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎక్కడో విజయవాడలో వరదలు వస్తే స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కళ్యాణదుర్గంలో విరాళాలు సేకరించారని, ముందు తన నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. స్థానిక సమస్యలను వదిలి సీఎం చంద్రబాబు మెప్పుకోసం పాకులాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా తాగునీరు సరిగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కాగా, మహిళలు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల్లో భాగంగా జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన వివిధ క్రీడలను రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలు జరిగాయి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆటలలో కొంత సమయాన్ని వెచ్చించడం వల్ల ఎంతో మానసిక ఉల్లాసం, ఆనందం, ఉత్సాహం పొందుతారన్నారు. 100 మీటర్ల పరుగు, 200 మీటర్ల పరుగు, 400 మీటర్ల నడక, షాట్ పుట్, జావలిన్ త్రో పోటీలు 45 ఏళ్లలోపు, 45 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రామప్ప, కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీల, సంజీవ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, శ్రీనివాసులు, శేషప్ప, జయరాం, నందకుమార్, జగన్, జగదీశ్వరయ్య, నారాయణ, సంజీవ్ రాయుడు పాల్గొన్నారు.

లేఖ వెనక్కు తీసుకోవాలి



నా కుమార్తెను మెడిసిన్ చదివించాలనే ఆలోచనతో లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపాను. కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం వల్ల ఫీజుల భారం మోయలేక పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంపై తీసుకున్న నిర్ణయాన్ని, కేంద్రానికి పంపిన లేఖను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి.

– రామాంజినేయులు, కోమటికుంట్ల, పుట్లూరు మండలం



ఎన్నో ఆశలు పెట్టుకున్నాం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లపై వివక్ష చూపించడం సరైన విధానం కాదు. గత ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కళాశాలల్లో సీట్లు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. డాక్టర్ కావాలనేది నాకోరిక. మదనపల్లె, పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ వస్తోందంటే సంతోషపడ్డాం. ఇప్పుడు సీట్ల కేటాయింపు లేకపోవడం మమ్మల్ని ఇబ్బందుల్లోకి నెట్టింది.

– ఎం.నూరి, బైపీసీ, విడపనకల్లు



పరుగుల వరద.. బౌలర్ల బేజార్





అవుట్ కాకుండా తప్పించుకునేందుకు క్రీజులోకి డైవ్ చేస్తున్న అభిమన్యు ఈశ్వరన్, స్టేడియంలో విద్యార్థులు, అభిమానుల సందడి

- అభిమన్యు ఈశ్వరన్, ప్రథమ్ సింగ్, తిలక్ సెంచరీలు
- పటిష్ట స్థితిలో ఇండియా- ఏ
- ఇండియా-డీ లక్ష్యం 488

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న రెండో రౌండ్ క్రికెట్ మ్యాచుల్లో మూడో రోజు శనివారం పరుగుల వరద పారింది. బ్యాటర్ల ధాటికి బౌలర్లు బేజారు పడ్డారు. రెండు మైదానాల్లోనూ సెంచరీల మోత మోగింది. ఇండియా-ఏ జట్టు ఇండియా-డీతో తలపడుతోంది. ఇందులో ఇండియా-ఏ రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా రెండు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు నమోదయ్యాయి. ప్రథమ్ సింగ్ 122 (12 ఫోర్లు, 1 సిక్సర్), తిలక్ వర్మ 111 (9 ఫోర్లు-నాటౌట్), మయాంక్ అగర్వాల్ 56 (8 ఫోర్లు), షస్వత్ రావత్ 64 (7 ఫోర్లు) పరుగులతో రాణించారు. దీంతో ఇండియా-ఏ జట్టు 380/3 స్కోరు వద్ద మ్యాచ్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని ఇండియా-డీ ముందు 488 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత ఇండియా-డీ జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లలో వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. యష్ దుబే 15, రికీ భుయి 44 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఓపెనర్ అథర్వ టైడ్ డకౌట్ అయ్యాడు. ఇండియా-ఏ బౌలర్ ఖలీల్ అహమ్మద్ ఒక వికెట్ తీశాడు.

ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్

ఇండియా- సీతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా-బీ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అజేయంగా 143 పరుగులు (12 ఫోర్లు) చేసి క్రీజులో ఉన్నాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీషన్ 70 పరుగులు చేశాడు. వీరిద్దరూ మినహా తక్కిన బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. ముషీర్‌ఖాన్ (1), సర్ఫరాజ్‌ఖాన్ (16), రింకూసింగ్ (6), నితీష్‌కుమార్ రెడ్డి (2), వాషింగ్టన్ సుందర్ (13) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఇండియా-సీ బౌలర్ అన్షుల్ కాంభోజ్ 5 వికెట్లు తీసుకుని, ఇండియా-బీ జట్టును కట్టడి చేశాడు. ఆట ముగిసే సమయానికి ఇండియా-బీ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 309 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్ (143), రాహుల్ చహర్ (18) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఇండియా-సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసింది.

అభిమానుల సందడి

శనివారం నాటి మ్యాచులకు క్రికెట్ అభిమానులు భారీగా తరలివచ్చారు. వారి సందడితో స్టేడియం హోరెత్తింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సూపర్ సెంచరీకి నీరాజనాలు పలికారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రావడంతో స్టేడియంలో గ్యాలరీలన్నీ కిక్కిరిశాయి. స్పైడర్ కెమెరా ఏ గ్యాలరీ వైపు తిరిగితే.. అక్కడి అభిమానులు ఒక్కసారిగా పైకిలేచి కేరింతలు కొట్టారు.



అభివాదం చేస్తున్న సెంచరీ హీరో తిలక్‌వర్మ





తిరోగమన శక్తులతో శాస్త్ర పురోగతికి విఘాతం

- శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని మార్చాలి
- జేవీవీ 17వ వార్షిక మహాసభల్లో వక్తలు



మాట్లాడుతున్న సవ్యసాచి చటర్జీ

అనంతపురం కల్చరల్: తిరోగమన శక్తులతో శాస్త్ర పురోగతికి విఘాతం ఏర్పడుతోందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని సమూలంగా మార్చాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలు శనివారం అనంతపురంలోని మూడవరోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలులో ప్రారంభమయ్యాయి. రెండురోజులపాటు సాగే మహాసభలకు సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన హాజరై జాతీయ పతాకాన్ని, జేవీవీ నాయకులు డాక్టర్ రంగన్న జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ మాజీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ సభలను ప్రారంభించి, 'శాస్త్రీయ దృక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, శాసనమండలి మాజీ చైర్మన్ విఠపు బాలసుబ్రమణ్యం, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త బోస్, మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి ఆత్మీయ అతిథులుగా ప్రసంగించారు. నేడు దేశం ఎదుర్కొంటున్న కఠినమైన సమస్యలకు పరిష్కార మార్గం జేవీవీతోనే సాధ్యమని పేర్కొన్నారు. 90 ఏళ్ల వయసులోనూ ఇతరుల సాయంతో విచ్చేసిన ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి సభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకు ముందు ఇటీవల మరణించిన భాగ్యవతి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షుడు భాస్కర్, కవి నబిరసూల్, జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి, వీరరాజు పాల్గొన్నారు.

చీకలగురికిలో దళితులపై దౌర్జన్యం

- ట్రాక్టర్‌తో కంది పంటను దున్నేసిన టీడీపీ వర్గీయులు



కంది పంటను చూపుతున్న ఓబులేసు

విడపనకల్లు: దళితులు సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ట్రాక్టర్‌తో కందిపంటను దున్నేసి ఆర్థికంగా నష్టం చేకూర్చారు. వివరాల్లోకెళితే.. చీకలగురికి చెందిన హరిజన చౌడమ్మ, ఓబులేసు దంపతులు సర్వే నంబర్ 60-బిలో మూడు ఎకరాల ప్రభుత్వ కాలువ పొరంబోకు భూమిని 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఏటా వివిధ రకాల పంటలు పెట్టుకుంటున్నారు. టీడీపీ వర్గీయులు కోళ్లపారం చిన్నయ్య కొడుకు గోవిందురాజు, వంద్రప్ప, షన్ముఖ కొడుకు తిప్పయ్య, నల్ల ఆంజనేయులు కంసుల ఎర్రిస్వామిలు కలిసి గత రెండు రోజులు కిందట నెల పైరు కంది పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారు. బాధితుడు హరిజన ఓబులేసు శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమకు 20 ఏళ్లుగా సాగులో ఉన్నామని, పట్టాదారు పాసుపుస్తకం కూడా ఉందని తెలిపారు. అయినా భూమిని వదిలిపెట్టాలంటూ అనేకసార్లు తన భార్య చౌడమ్మను, కుటుంబ సభ్యులను టీడీపీ వారు బెదిరిస్తూనే ఉన్నారన్నారు. భౌతికదాడులకు సైతం పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో తమ పార్టీ ఉందని, తాము చెప్పినట్టే వినాలని హుకుం జారీ చేశారన్నారు. రోజూ భయం భయంగా బతకాల్సిన పరిస్థితి దాపురించిందని ఓబులేసు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమక రక్షణ కల్పించి, పంటను నాశనం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌ను ఆశ్రయించారు.

వివాహేతర సంబంధంతోనే కార్మికుడి హత్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి అర్బన్: స్టీల్‌ప్లాంట్ కార్మికుడు మిఠాయిగిరి నూరుల్లా హత్యకు వివాహేతర సంబంధమే కారణమని డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు తెలిపారు. హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తాడిపత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సాయిప్రసాద్‌తో కలిసి మీడియాకు వెల్లడించారు. మిఠాయిగిరి నూరుల్లా అర్జాస్ స్టీల్‌ప్లాంట్లో లేబర్‌గా పనిచేస్తుండేవాడు. లారీ డ్రైవర్ నజీర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసిన తర్వాత నూరుల్లా, నజీర్ మధ్య మనస్పర్థలు వచ్చాయి. మూడేళ్ల కిందట నూరుల్లాపై నజీర్ బంధువులతో కలిసి దాడికి యత్నించాడు. ఆ సమయంలో నూరుల్లా లేకపోవడంతో అతడి మేనల్లుడు జలీల్‌ఖాన్‌పై దాడి చేశారు. అప్పట్లో కేసు నమోదైంది. అయితే లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల వారు రాజీ అయ్యారు. ఈ నెల 12న లారీ డ్రైవర్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. అదే రోజు ఇంటి వద్దకు ద్విచక్రవాహనంపై వచ్చిన నూరుల్లాతో నజీర్ ఘర్షణకు దిగాడు. దీంతో నజీర్ మామ జాఫర్, అతని కొడుకు మౌలాలిలు ముగ్గురు కలిసి బండరాళ్లతో దాడి చేయడంతో నూరుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు నజీర్, మామ జాఫర్, కుమారుడు మౌలాలీలను అరెస్టు చేశారు. మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ధ్వంసం టీడీపీ గూండాల పనే

- నిందితులపై చర్యలు తీసుకోవాలని విశ్వ డిమాండ్



ధ్వంసమైన ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: చిన్నముష్టూరులోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రం భవన ధ్వంసం, ఫర్నీచర్ అపహరణకు పాల్పడింది టీడీపీ గూండాలేనని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను టీడీపీ వారు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. అందులో భాగంగానే ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాల భవనాలు, శిలాఫలకాలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసాలకు పాల్పడుతూ పైశాచికానందం పొందుతున్నారన్నారు. చిన్నముష్టూరు ఆరోగ్య కేంద్రంపై దాడి జరిగినా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. మోపిడిలో సర్పంచ్ సిద్దు పెంచిన పండ్ల మొక్కలను టీడీపీ గూండాలు నరికేసినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వ భవనాల ధ్వంసంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని, తక్షణమే దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్, పార్టీ రూరల్ కన్వీనర్ సుంకన్న, మాజీ సర్పంచ్ బాబు, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, గంధోడి మారేష్ పాల్గొన్నారు.

పరిహారంపై స్పష్టత లేకుండా చీనీచెట్ల తొలగింపు



రైతు రాగేని జయరాముడు

పుట్లూరు: పరిహారంపై స్పష్టత ఇవ్వకుండా చీనీ చెట్లు తొలగించారని పుట్లూరుకు చెందిన రైతు రాగేని జయరాముడు ఆవేదన వ్యక్తం చేశాడు. 2.5 ఎకరాల విస్తీర్ణంలో తాను చీనీ సాగు చేసుకుంటున్నానని చెప్పాడు. అనంతపురం – వైఎస్సార్ జిల్లాల మధ్య విద్యుత్ సరఫరా కోసం టవర్ల నిర్మాణం చేపట్టే విషయమై ఆగస్టు ఎనిమిదో తేదీన రెవెన్యూ, పవర్ గ్రిడ్ అధికారులు గ్రామసభ నిర్వహించారని తెలిపాడు. టవర్ నిర్మాణానికి రూ.6లక్షలు, పండ్లతోటలు, పంట నష్టానికి అదనంగా పరిహారం చెల్లించాలని రైతులు కోరారని తెలిపాడు. నిబంధనల ప్రకారం చెల్లిస్తామని చెప్పిన అధికారులు.. అది ఎంత అనేది మాత్రం వెల్లడించలేదన్నాడు. ఇటీవల జేసీబీతో ఆరేళ్ల వయసున్న 50 చీనీచెట్లను తొలగించి టవర్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నాడు. తోటలో ట్రాక్టర్లు, జేసీబీలు తిరగడం వల్ల చాలా నష్టం జరిగిందన్నాడు. వారం క్రితం కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న టవర్ల నిర్మాణ పనులు ఆపరాదని చెప్పి తనతో ఓ కాగితంపై సంతకం చేయించుకున్నారన్నాడు. తనకు పరిహారం విషయంలో న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.

డెంగీ లక్షణాలతో బాలుడి మృతి



అజయ్‌కుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్‌కు చెందిన బాలుడు డెంగీ వ్యాధి లక్షణాలతో మృతి చెందారు. జోగి అంబోజీ, జోగి నాగవేణి దంపతుల రెండో కుమారుడు జోగి అజయ్‌కుమార్ (7) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. వారం క్రితం జ్వరం ఎక్కువ ఉండటంతో తల్లిదండ్రులు బళ్లారిలోని ఎంఎస్ఆర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం రాత్రి బాలుడికి డెంగీ లక్షణాలు ఉన్నాయని, రక్తకణాలు (ప్లేట్‌లైట్స్) తగ్గిపోయాయని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో అక్కడి నుంచి విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున అజయ్‌కుమార్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే బాలుడు చనిపోయిందని డెంగీతో కాదని.. జ్వరం తీవ్రత ఎక్కువై మృతి చెందాడని బొమ్మనహాళ్ వైద్యాధికారులు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి.. అవసరమున్న వారికి చికిత్సలు అందిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు షేక్ మతిన్

చెన్నేకొత్తపల్లి: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని గుల్జార్‌పేటకు చెందిన షేక్ మతిన్ (48) తన మిత్రుడు మహమ్మద్ గౌస్‌తో కలసి శనివారం ద్విచక్ర వాహనంపై లేపాక్షికి బయల్దేరారు. మార్గం మాధ్యలో చెన్నేకొత్తపల్లి దాటగానే హంద్రీ-నీవా కాలువ సమీపంలో ట్రాక్టర్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ మతిన్ మృతి చెందాడు. గాయపడిన మహమ్మద్ గౌస్‌ను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్చెల్సీలో ఆళ్లగడ్డ వాసి గల్లంతు

బొమ్మనహాళ్: ఉంతకల్లు శివారులోని హెచ్చెల్సీలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు... ఆళ్లగడ్డకు చెందిన రాజ్‌కుమార్ (51) శనివారం ఏకాదశి సందర్భంగా తులసీమాల ధరించేందుకు ఉంతకల్లులోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయానికి వచ్చాడు. స్నానం కోసం సమీపంలోని హెచ్చెల్సీలోకి దిగగా.. నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. దీంతో వారి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

'నారాయణ' ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన రాఘవేంద్ర

బుక్కరాయసముద్రం: వడియంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణ కాలేజీ ఉద్యోగి దుర్మరణం చెందాడు. అనంతపురం మూడోరోడ్డులో నివాసం ఉంటున్న రాఘవేంద్ర (40) నారాయణ కళాశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వడియంపేట సమీపంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాంలో రాఘవేంద్ర తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లి ఆలస్యమవుతోందని యువకుడి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

కంబదూరు: తొందరగా పెళ్లి చేసుకోవాలన్న యువకుడికి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. అండేపల్లికి చెందిన తిమ్మరాయుడు, పద్మక్క దంపతుల మూడో కుమారుడు సురేష్ (20) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవలే గ్రామానికి తిరిగి వచ్చి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. తనకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరడంతో.. వారు వధువు కోసం అన్వేషణలో పడ్డారు. సంబంధం కుదరడానికి మరింత ఆలస్యమయ్యేలా ఉందని భావించి మనస్తాపానికి గురైన సురేష్ శనివారం తమ పొలంలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ధైర్యంగా ఉండాలి



కానిస్టేబుల్ చంద్రానాయక్ మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: పోలీసు శాఖ అండగా ఉంటుంది.. ధైర్యంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో విధుల్లో ఉన్న అనంతపురం జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ చంద్రానాయక్ గుండెపోటుతో మరణించారు. స్థానిక వీరనారమ్మ దేవాలయం సమీపంలో చంద్రనాయక్ స్వగృహంలో ఆయన మృతదేహానికి ఎస్పీ జగదీష్ నివాళులర్పించారు. మృతుడి భార్య అరుణ, కుమార్తెలు అంజలి, నందినిని పరామర్శించారు. కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. అందాల్సిన సాధారణ బెనిఫిట్స్‌తో పాటు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు హోం మంత్రి ప్రకటించిన అంశాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివా రెడ్డి, ఆర్ఐ మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, గాండ్ల హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతి

అనంతపురం రూరల్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని పాతూరులో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా హిందీ దివస్



మాట్లాడుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ.. హిందీ మనదేశ రాజభాష అన్నారు. ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోవాలన్నారు. హిందీ భాషలో దేశ సంస్కృతి ప్రతిబింబిస్తోందన్నారు.విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్, హిందీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్, ఏఓ శ్రీనాథ్, అధ్యాపకులు మురళీధర్, ఎ.ఆదెప్ప, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులకు 'అమ్మ' చేయూత



ల్యాప్‌టాప్ అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: విద్యార్థుల చదువులకు 'అమ్మ' సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. నగరానికి చెందిన మహాదేవ నాయుడు కుమారులు దినేష్, శ్యామసుందర్ కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో చదువుకుంటున్నారు. ప్రతిభావంతులైనప్పటికీ ఆర్థికంగా ఫీజులకు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి శనివారం రూ.2 లక్షల సాయం అందించారు. అలాగే మరో రూ.50 వేలు విలువైన ల్యాప్‌టాప్, పుస్తకాలకు మరో రూ.10 వేలు అందించి ఉదారతను చాటుకున్నారు. నిరుపేద విద్యార్థులకు భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు అందరూ అండగా నిలవాలని సూచించారు.

మార్కెట్‌లోకి 'మహీంద్రా థార్ రాక్స్'



కారును విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని ఎంజీబీ మొబైల్స్ షోరూంలో మహీంద్రా థార్ రాక్స్ కారును శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం సీఈఓ ఆదిత్య మాచాని, జనరల్ మేనేజర్స్ వంశీకృష్ణ, రామకృష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్ వలి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అత్యాధునిక టెక్నాలజీ, అతి పెద్ద సన్ రూఫ్‌తో ఈ వాహనం తయారు చేసినట్లు వివరించారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.12.99 లక్షలు కాగా.. కారు 7 రంగుల్లో లభిస్తుందని తెలిపారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



'రాష్ట్రంలో నీట్‌కు సన్నద్ధం అవుతున్న విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని నీట్ కోచింగ్ తీసుకుంటున్నారు. అయినా ర్యాంకులకు తగ్గట్లుగా సీట్లు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీలో కొత్తగా వైద్య కళాశాలలు ప్రారంభించాల్సిన ప్రభుత్వం.. కళాశాలలు నడపలేమని ఎన్ఎంసీకి లేఖ రాయడం సరికాదు. వైద్య విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

– శ్రీతరుణ్ (ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం)



విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం



వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్థుల భవిష్యత్‌తో కూటమి ప్రభుత్వ చెలగాటం ఆడుతోంది. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను నీరుగారుస్తోంది. గత ప్రభుత్వం ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజిని నిర్మించి పేద మధ్య తరగతి వారికి వైద్య విద్యను అందించాలని నిర్ణయించుకుంది. అయితే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని భావించడం దుర్మార్గం. వైద్య విద్యను ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి వారికి వైద్య విద్య భారంగా మారుతుంది.

– రమణారెడ్డి, ఒంటికొండ, చెన్నేకొత్తపల్లి మండలం

ఇల వైకుంఠపురిలో శ్రీవారి వైభవం

అనంతపురం కల్చరల్: సాక్షాత్తు తిరుమల వైభవాన్ని సాక్షాత్కరింపజేస్తూ కలియుగ వైకుంఠపురమైన శ్రీవారి దివ్య సన్నిధిలో జరిగే వైభవాన్ని వేద పండితులు నయన మనోహరంగా నిర్వహించారు. శనివారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని శ్రీసెవెన్ ఫంక్షన్ హాల్ వేదికగా 'అనంతలో శ్రీవారి సేవలు' పేరిట ఉదయం నుంచి రాత్రి వరకూ తిరుమల క్షేత్రం తరహాలో స్వామి వారి సేవలు జరిగాయి. ఉదయం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవి ప్రారంభించారు. అలాగే ఆత్మీయ అతిథులుగా మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు, నాట్యాచార్యులు సంధ్యామూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిరుమల దర్శనంతో ఎంత ఆనందానుభూతి కలిగిస్తుందో.. అంతేహాయిని కల్గించే ఆధ్యాత్మిక సేవలు నిర్వహిస్తున్న ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన నిలువెత్తు శ్రీనివాసుడి విగ్రహానికి తిరుమల నుంచి విచ్చేసిన వేదపండితులతో పాటూ విశిష్ట అతిథిగా విరూపాక్ష దత్తపీఠాధిపతులు శ్రీవిద్యానృసింహ భారతి, బాలాజీ శర్మ తదితరులు టీటీడీని తలపిస్తూ సుప్రభాత సేవ, సూర్యప్రభ వాహన సేవ, స్నపన తిరుమంజనం, సహస్ర కలశాభిషేకం, హనుమద్ వాహన సేవ, అష్టదళపాదపద్మ సేవ, తోమాల సేవ, పుష్పయాగం, తిరుప్పాడసేవ, ఏడు శనివారాల వ్రతాలు, గరుడవాహన సేవ, సహస్ర దీపాలంకరణ, ఎదుర్కోలు ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవంతో పాటూ చంద్రప్రభ వాహన సేవ, పవళింపు ఉత్సవం జరిగాయి. వందల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంబటి ఆది నారాయణరెడ్డి దంపతులు కర్తలుగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరిపించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీనివాసులు, ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మేయర్ వసీం, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి, తదితరులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

17న అనంత పద్మనాభ వ్రతం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే అనంత పద్మనాభ స్వామి వ్రతం ఈనెల 17న స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీ స్వామి ఆశ్రమంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం శాస్త్రోక్తంగా సామూహిక వ్రతం, అనంతరం డాక్టర్ పాణ్యం వసుంధర ప్రవచనాలు ఉంటాయని పేర్కొన్నారు.

'విద్యను వ్యాపారం చేయొద్దు'

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో విద్యను వ్యాపారం చేసున్నారు. విద్యను ప్రైవేటీకరణ చేయొద్దని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన చేయడం విరమించుకోవాలన్నారు. ఇలాంటి నిర్ణయాలతో పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్యను దూరం చేసినట్లు అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై పునారాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాలతో కలసి ఉద్యమాలు చేస్తామన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

ఆత్మకూరు: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో శనివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, జిల్లా కార్యదర్శి రామయ్య, ఐద్వా నాయకురాలు వెంకటమ్మ, గంగమ్మ, గోవిందమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో అడ్మిషన్ల సందడి



అప్లికేషన్ తీసుకుంటున్న విద్యార్థిని

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది. వివిధ కోర్సుల్లో కొత్తగా చేరుతున్న విద్యార్థుల రిజిస్ట్రేషన్లతో వర్సిటీలో సందడి నెలకొంది. గత రెండు రోజుల్లో 700 మంది విద్యార్థులు 24 ప్రోగ్రామ్‌ల్లో అడ్మిషన్లు తీసుకున్నారు. దేశంలోని 23 రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఆయా ప్రోగ్రామ్‌లను ఎంపిక చేసుకున్నారు. ఈ నెల 17 నుంచి కొత్త బ్యాచ్‌కు తరగతులు జంతలూరు శాశ్వత క్యాంపస్‌లో నిర్వహించనున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హరియాన్ చెరువు గ్రామంలో వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. మురుగు కాలువల్లో దోమల లార్వా పెరగకుండా అబెట్ మందు పిచికారీ చేశారు. ఇళ్ల వద్ద నీటిని చాలా రోజులు నిల్వ చేసుకోరాదన్నారు. డెంగీ, మలేరియా విష జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్, సచివాలయ ఏఎన్ఎం అశ్విని, ఆశావర్కర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రాసిక్యూటర్ల తొలగింపు

అనంతపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగిస్తున్నారని ఎస్సెన్షియల్ కమాడిటీ యాక్ట్ మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో నియామకం చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఏదో రకంగా తొలగించాలనే దురుద్దేశంతో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నారన్నారు. పనిలేకున్నా కొనసాగిస్తున్నారని, ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోందని చెబుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్సెన్షియల్ కమాడిటీస్ యాక్ట్‌కు సంబంధించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను జీఓ 862 మేరకు తొలగించారన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వాస్తవ పరిస్థితిని జాయింట్ కలెక్టర్‌ను అడిగి వాస్తవ పరిస్థితిని తెలుసుకుని సిఫార్సు చేస్తే బాగుండేదని, కానీ ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. వాస్తవానికి మూడు సంవత్సరాల పదవీ కాలం ఉన్నప్పటికీ రెండేళ్లకే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను తొలగించే చర్యలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏదో ఒక సాకు చూపించి గత ప్రభుత్వంలో నియామం అయిన పబ్లిక్‌ప్రాసిక్యూటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఎద్దేవా చేశారు. కొంతమంది ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, మరికొంత మందికి పనిలేదని సాకు చూపిస్తూ తొలగిస్తున్నారని ఆవేదన చెందారు.

అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ హైస్పీడ్ వైఫై

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా హైస్పీడ్ వైఫై కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చినట్లు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా శనివారం తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ హైస్పీడ్ వైఫై సౌకర్యాన్ని ఫైబర్–టు–ది–హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) వినియోదారులందరికీ అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారులు పాన్–ఇండియా అంతటా రోమింగ్ చేస్తున్నప్పుడు సేవల్లో ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన సేవలందించేందుకు కొత్త వైఫై విధానం దోహదపడుతుందని తెలిపారు. ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు వైఫై హాట్‌స్పాట్ స్థానాల్లోనూ హైస్పీడ్ వైఫై కనెక్టివిటీతో నాణ్యమైన సేవలు పొందవచ్చన్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఇంట్లో లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు ఎటువంటి ఆటంకం లేకుండా కనెక్టివిటీ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ అధికారిక వెబ్‌సైట్ www.ap.brn.co.in చూడాలని సూచించారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ మిగులు, బంజరు, తదితర భూములను అసైన్మెంట్ కమిటీ ద్వారా పేద దళిత, గిరిజన, వ్యవసాయ కూలీలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. పేదలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన హక్కులు దూరమవుతుండటం బాధాకరమన్నారు. పేదల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బడాబాబులు, మల్టీ నేషనల్ కంపెనీలకు ఇచ్చిన భూములను అర్హులైన పేద వ్యవసాయ కార్మికులకు పంచాలని కోరారు. ఉపాధి పథకం కూలీ రేట్లు పెంచాలన్నారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు, రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు సాగే నాగరాజు, పెద్దయ్య, శివ, శ్రీనివాసులు, సూర్యనారాయణ, చిన్నరాయుడు, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

వరద బాధితులకు విరాళం

రాప్తాడురూరల్/ఆత్మకూరు: విజయవాడ వరద బాధితులకు సీపీఐ అండగా నిలిచింది. అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల పరిధిలో విరాళాల రూపంలో రూ. 30 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శనివారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జునకు అందజేశారు. కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవడంలో తెలుగు ప్రజలు ముందుంటారని మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జి.శ్రీకాంత్, ఆత్మకూరు మండల కార్యదర్శి సనప నీళ్లపాల రామకృష్ణ, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, నాయకులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జునకు నగదు అందజేస్తున్న నాయకులు

ఈ-పంట నమోదు గడువు పొడిగించాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈ–పంట నమోదు ప్రక్రియను అక్టోబరు 15వ తేదీ వరకు పొడిగించాలని ఏపీ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇదే క్రమంలో 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు ప్రకటించాలని కోరింది. శనివారం స్థానిక రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రారంభంలో సర్వర్ సమస్య కారణంగా ఈ–పంట నమోదు సక్రమంగా జరగలేదన్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రామ వ్యవసాయ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పంట సాగుకు రైతులు సిద్ధమై విత్తనాలు వేయాలని అనుకున్నా సకాలంలో వర్షాలు రాలేదని పేర్కొన్నారు. సమగ్ర భూసర్వే క్రమంలో ఆన్‌లైన్‌లో సర్వే నంబర్ల మార్పుతో చాలా మంది రైతులకు సంబంధించి ఇప్పటికీ ఈ–పంట నమోదు కాలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ–పంట నమోదు ఈనెల 15 వరకే చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ–పంట నమోదు కాకపోతే పంట నష్టపరిహారం, బీమా అందక రైతులు నష్టపోతారని గుర్తు చేశారు. సకాలంలో వర్షాలు రాక పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ జరుగుతోందన్నారు. కాబట్టి ప్రత్యామ్నాయ విత్తనాలు సాగు చేసిన రైతులకూ ఈ–పంట నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఈ–పంట నమోదు ప్రక్రియ అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించాలన్నారు. జిల్లాలో సాగు చేసిన పంటల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ పంటల బీమా, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలును ప్రభుత్వం ప్రకటించడంతో పాటు రైతుల ఖాతాల్లో జమ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.